## కొడంగల్‌లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

**కొడంగల్ రూరల్, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు క్వీన్‌స్వీప్ చేశారు. గురువారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కొడంగల్ మండలంలో కాంగ్రెస్ అభ్యర్థుల హవా కొనసాగింది. శుక్రవారం కొడంగల్ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో గెలుపొందిన సర్పంచ్‌లతో కొడంగల్‌లో టిపిసిసి ప్రతినిధి ఎండి.యూసుఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి పట్టంకట్టారన్నారు. ఈ ఎన్నికలకుముందు కొడంగల్‌నుంచి విద్యాసంస్థలు తరలిపోతున్నాయని, ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని కొంతమంది కుట్రలు పన్నారని ఆరోపించారు. కానీ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ కుట్రలను తిప్పికొడుతూ కొడంగల్ మండలంలో కాంగ్రెస్‌పార్టీని ఆదరించి అభ్యర్థులను గెలిపించారన్నారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి కోట్లాది రూపాయలు మంజూరుచేస్తున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## రెండవ విడత ఎన్నికలకు సిద్ధం

**రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

రెండవవిడత స్థానిక ఎన్నికలకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బందిని నియమించాన్నట్లు రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమక్షంలో పూర్తిచేశారు. శుక్రవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రెండవవిడతలో మూడవ ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే రెండవవిడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటివిడత శిక్షణను ఎంపికచేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

## నేడు మంత్రి గడ్డం వివేక్ పరిగికి రాక

-ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి

**పరిగి, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

పరిగి మండల పరిధిలోని నక్కల్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి విచ్చేస్తున్న సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామోహన్‌రెడ్డి వారి నివాసంలో ఏర్పాటుచేసిన పత్రికాసమావేశంలో మాట్లాడుతూ, రెండు ఎకరాల్లో రూ.45కోట్లతో నిర్మించబోతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర గనులు, కార్మిక ఉపాధికల్పనశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వస్తున్నారని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులకు టెక్నాలజీ సంబంధించిన కోర్సులు అందించాలని, ఉపాధి కల్పించాలన్న ప్రధానలక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనతో కళాశాలలను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నామని ఈసందర్భంగా 45కోట్ల రూపాయలతో పరిగి నియోజకవర్గానికి సంబంధించినటువంటి ఎటి సినీ సర్కిల్ వద్ద నిర్మిస్తున్నామని తెలిపారు. రెండు ఎకరాలలో నిర్మిస్తున్న తిగిది భవనంలో అన్నిరకాల కోర్సులు అందుబాటులో ఉంచుతామని విద్యార్థులు నైపుణ్య కోర్సులు నేర్చుకున్న తర్వాత మన సమీపంలో నిర్మిస్తున్న లగచర్ల పారిశ్రామికవాడల్లో పని చేయుటకు కూడా ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కులకచ్చర్ల ఎంసి చైర్మన్ ఆంజనేయులు, పూడూరు మండలం సురేందర్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి శాంతిరంగ్య, తదితరులు పాల్గొన్నారు.

## నియామక పత్రం ఇవ్వని అధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు




జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి బయటకు వస్తున్న వార్డు సభ్యులు, నాయకులు

**వికారాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నిక నియామక పత్రం ఇవ్వని ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలని తాండూరు మండలం అంతారం గ్రామం ఎన్నికైన వార్డు సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. 11న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా తాండూరు మండలం అంతారంగ్రామంలో జరిగిన ఎన్నికల్లో వార్డుసభ్యులుగా సుందరి నాగమణి, దౌల్తాబాద్ అనిత, విజయేందర్, ఎం.ప్రవీణ్‌కుమార్, వడ్డె రవి, గోరెమ్మ, సేరి విజయేందర్‌రెడ్డి వార్డు సభ్యులుగా గెలుపొందారు. గెలుపొందిన అనంతరం వార్డుసభ్యులకు ఇవ్వాల్సిన ఎన్నిక ధృవ పత్రం ఎన్నికల అధికారి డి.రవికుమార్ ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రత్యర్థుల సూచన మేరకే ఎన్నికల ధృవపత్రం ఇవ్వలేదని వార్డు సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని వార్డుసభ్యులు కోరారు.

## బిఆర్ఎస్‌వి నాయకులు ధర్నా

-అరెస్ట్ చేసిన పోలీసులు



గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను, డిసిఎంఎస్‌వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, విద్యార్థి నాయకులను అరెస్ట్‌చేసిన శామీర్‌పేట పోలీసుల దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

అధికారుల నిర్లక్ష్యం వల్లనే గురుకుల పాఠశాలలో విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారని, గురుకుల పాఠశాలలపై బిసిమంత్రి సమీక్షలు చేయకపోవటంతో, పై అధికారుల పర్యవేక్షణ కొరవడి సంబంధిత అధికారులు, నిర్వాహకులు, ప్రిన్సిపల్, వార్డెన్స్, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. శుక్రవారం శామీర్‌పేటలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకులపాఠశాలను ఆయనతోపాటు బిఆర్ఎస్‌వి విద్యార్థి నాయకుల ప్రతినిధిబృందం సందర్శించింది. అయితే గురువారం గురుకుల పాఠశాల విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించటంలేదని ఇబ్బందులు పడుతున్నామని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేయటం, జిల్లా, మండల అధికారులు, పోలీసులు సందర్శించి పరిస్థితిపై ఆరాతీయటం జరిగింది. శుక్రవారం ఈవిషయం తెలుసుకున్న బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, విద్యార్థినాయకులు, విద్యార్థులతో, తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతోనే నిర్వాహకులు పారిశుధ్యపనులు, వంటపనులు చేయిస్తున్నారని, వినకపోతే రబ్బరుపైపులతో కొడుతున్నారని అన్నారు. తరగతిగది పక్కన మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం వల్ల చదవలేకపోతున్నామని విద్యార్థులు వివరించారు. భోజనంలో రాళ్లు వస్తున్నట్లు, విద్యార్థులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని అన్నారు. సమస్యలు తెలుసుకుని రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు బిఆర్ఎస్‌వి నాయకులు, విద్యార్థులతో కలిసి గురుకుల పాఠశాల ముందు ధర్నాచేసి ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో శామీర్‌పేట పోలీసులు బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డిని, పలువురు విద్యార్థి నాయకులను అరెస్ట్‌చేశారు. బిసి గురుకుల సొసైటీ జాయింట్ సెక్రటరీ మద్దిలేటి, శామీర్‌పేట పోలీసులు గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. అయితే వచ్చిన అదికారులు విద్యార్థుల సమస్యలు పరిశీలించాలని కోరినా మద్దిలేటి చూడటం లేదని బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ముందు ధర్నా చేయటం జరిగిందన్నారు. ఈసందర్భంగా బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బిసిసంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల పాఠశాలలను గాలికి వదిలేశారని, గురుకుల పాఠశాలల సమస్యలపైన సమీక్షలు చేయకపోవటంవల్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. విద్యార్థులసమస్యలను ప్రభుత్వం స్పందించి పరిష్కరించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు డిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, విద్యార్థినాయకులు యశ్వంత్‌గుప్తా, బత్తిని ప్రశాంత్‌గౌడ్, విశాల్, యాద క్రాంతి, నితీష్, చంద్రకాంత్, షోయబ్, పవన్, అభీముదిరాజ్, ఆనంద్, కరణ్ పాల్గొన్నారు.

# మార్పునకు శ్రీకారం చుట్టిన తాండూరు ఓటర్లు

## బడా నేతలు గల్లంతు

## అజేయులకు తప్పని అపజయం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరు కున్నట్లు ఫలితాలు చెబుతున్నాయి. తొలిదశ ఎన్ని కల్లో అనేక గ్రామాల్లో యువతకు పట్టం కట్టారు. పలుచోట్ల మార్పునకు శ్రీకారం చుట్టారు. ఓటమి ఎరుగని నేతలకూ వ్యతిరేక తీర్పునిచ్చారు. ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఓటర్లలో చైతన్యం కనిపించింది. తొలిదశ తాండూరు, కొడంగల్ సెగ్మెంట్లలో గురువారం 225 గ్రామపంచా యతీలకు పోలింగ్ జరిగింది. అంతకు వారంరోజులకు ముందే 37 జిపిలను ఏకగ్రీవం చేసిన విషయం తెలిసిందే. కొడంగల్ నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి, ఆయనసోదరుడు తిరుపతిరెడ్డి ప్రభావం వల్ల సింహభాగం పంచాయతీలను కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు హస్తగతం చేసుకున్నారు. తాండూరు నియోజకవర్గంలో మాత్రం బిఆర్ఎస్ ప్రభావం చూపెట్టింది. అయితే, ఎక్కడ చూసినా యువనేతలే పోటీపడటం వల్ల యువ సర్పంచ్‌లు విజయంసాధించారు. రాజకీయాల్లోకి కొత్తరక్తం రావడం చూస్తుంటే వారిపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని తెలుస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరుచేసే నిధులు, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలుచేస్తూ పేదల గృహ నిర్మాణా లు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్ వంటి ప్రగతి మార్గాలవైపు గ్రామాలను నడిపిస్తారని ఆశలు పెట్టుకున్నారు. తాండూరు నియోజక వర్గంలో చాలా ఏళ్లుగా రాజకీయాల్లో తిష్ఠవేసిన నేతలను ఈసారి ఓటు అనే ఆయుధంతో సాగనంపారు. బషీరాబాద్, నీళ్లపల్లి, కొర్విచేడ్, పర్వతపల్లి, తాండూరు మండలం సంగెంకలాన్, జినుగుర్తి, గౌతాపూర్, చెన్గేష్‌పూర్, పెద్దేముల్ మండలం మంబాపూర్, పెద్దేముల్, యాలాల, కోకట్, దేవనూర్ గ్రామపంచాయతీల్లో సీనియర్ రాజకీయ నేతలకు ఓటర్లు చెక్ పెట్టారు.

యాలాలమండల కేంద్ర గ్రామపంచాయతీలో మాజీ జడ్పిటిసి సిద్రాల శ్రీనివాస్ తనయుడు శ్యాంప్రసాద్ సర్పంచ్‌గా తొలిసారి పోటీచేసి సమీప ప్రత్యర్థి శివప్ప చేతిలో ఓటమిచెందారు. 1995 నుంచి యాలాల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన సిద్రాల శ్రీనివాస్ ఇటీవల పాత మిత్రుడు బాలేశ్వర్‌గుప్తాతో మళ్లీ చేయి కలిపారు. దాంతో ఓటర్లు వ్యతిరేక తీర్పు ఇచ్చారని అంటున్నారు. 1995లో సర్పంచ్‌గా బాలేశ్వర్‌గుప్తా గెలుపొందగా, ఉపసర్పంచ్‌గా సిద్రాల శ్రీనివాస్ పదవి చేపట్టారు. వీరిద్దరూ బిజెపికి ఎనలేని సేవలు అందించారు. 2001లో సిద్రాల యాలాల వైస్ ఎంపిపిగా గెలుపొందగా తన వదిన సిద్రాల లీలావతి సర్పంచ్‌గా ఎన్నికైనారు. 2005లో టిడిపిలోచేరి జడ్పిటిసిగా గెలుపొందగా 2013లో యాలాల పిఎసిఎస్ చైర్మన్‌గా గెలుపొందారు. 2019లో ఆయన కూతురు సిద్రాల సంధ్య జడ్పిటిసిగా గెలుపొందగా, అదే ఎన్నికల్లో శ్రీనివాస్ భార్య సిద్రాల సులోచన సర్పంచ్‌గా విజయం సాధించారు. ఇలా వరసగా ఓటమి ఎరుగని నేతగా ఎదిగిన శ్రీనివాస్ ఇరవై ఏళ్లుగా మిత్రుడు బాలేశ్వర్‌గుప్తాకు దూరమైనారు. 2014లో టిఆర్ఎస్‌లో చేరారు. 2023 శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డికి పని చేశారు. బిజెపి, బిఆర్ఎస్ మద్దతుతో ఈ ఎన్నికల్లో సిద్రాల శ్రీనివాస్ తనయుడు శ్యామ్‌ను రాజకీయ ఆరంగేట్రం చేయించినా ఓటమి చెందారు. యాలాలలో బిజెపి తరపున ఎవ్వరూ బరిలో నిలవలేదు. బాలేశ్వర్‌గుప్తా సర్పంచ్‌గా, ఎంపిపిగా, పిఎసిఎస్ చైర్మన్‌గా గెలుపొందిన అనుభవం ఉంది. బిజెపి తరపున తాండూరు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిచెందారు. ఇదే మండలానికి చెందిన సీనియర్ నేత మాజీ ఎంపిపి కరణం పురుషోత్తమరావు కూడా సొంత ఊరు కోకట్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిని బరిలో దించలేదు. ఆయన కూడా యేడాదిన్నర క్రితం కాంగ్రెస్‌లో చేరినా చురుకైన పాత్ర పోషించడంలేదు. అయితే, కోకట్‌లో బరిలోదిగిన అభ్యర్థులంతా కరణం ఆశీస్సులు పొందారు. గెలిచిన వారే తన మనుషులని ఆయన చెబుతున్నారట. కరణం తనయుడు అనిరుధ్‌ను సర్పంచ్‌గా బరిలో దించాలని మాజీమంత్రి మహేందర్‌రెడ్డి, గ్రామస్థులు సూచించినా ఆయన వెనకడుగు వేశారు. తాండూరు మండలం సంగెంకలాన్‌లో కాంగ్రెస్ లీడర్, డిసిసిబి వైస్‌చైర్మన్ రవిగౌడ్ సమీప బంధువు ఈ సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిచెందారు. కంటి సైగతో గ్రామాన్ని శాసించిన రవిగౌడ్ కుటుంబీకులు రెండుసార్లు ఎంపిపిగా సేవలు అందించారు. జడ్పిటిసిగా, పిఎసిఎస్ చైర్మన్‌గా, కౌన్సిలర్‌గా సేవలు అందించారు. తన కుటుంబీకులే మండలాన్ని శాసించారు. సర్పంచ్‌గా కూడా ఆయన కుటుంబీకులే ఎక్కువసార్లు గెలుపొందారు. కానీ ఈసారి ప్రత్యర్థి చేతిలో తన బంధువు సర్పంచ్‌గా ఓడిపోవడం గమనార్హం. రవిగౌడ్ సోదరుడు నారాయణగౌడ్, ఆయన తనయులు అప్రతిహతంగా విజయాలుసాధించినా, ఈ ఎన్నికలు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. తాండూరు మండలం జినుగుర్తిలో కూడా సీనియర్ కాంగ్రెస్ నేత ఉత్తమ్‌చంద్‌కూ చేదు అనుభవం మిగిల్చింది. గతంలో ఆయన కుటుంబీకులు సర్పంచ్‌గా గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి పదవులు కూడా నిర్వహించారు. మాజీమంత్రులు మాణిక్‌రావు, చంద్రశేఖర్, నారాయణరావు, ఎం.రమేష్ కుటుంబీకులతో సాన్నిహిత్యం ఉంది. ఈసారి ఉత్తమ్ సోదరుని కొడుకు సర్పంచ్‌గా బరిలోదించగా ఓటమిపాలయ్యారు. ఈసారి అక్కడ విద్యావంతుడైన యువనేత భారీ మెజార్టీతో విజయం సాధించారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, బషీరాబాద్‌లో మాజీ ఎంపిపి అజయ్‌ప్రసాద్ తనయుడు కూడా ఓటమిచెందారు. మంబాపూర్ నారాయణరెడ్డి గతంలో సర్పంచ్‌గా పోటీచేసి ఓటమిచెందారు. ఇటీవల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అనుచరుడుగా ఉంటున్నారు. గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాస్ గెలుపొందారు. బషీరాబాద్‌లో అజయ్‌ప్రసాద్ గత ఇరవై ఏళ్లుగా రెండుసార్లు ఎంపిపిగా, పిఎసిఎస్ వైస్‌చైర్మన్‌గా సేవలు అందించగా తన సోదరుని కుమారుడు సర్పంచ్‌గా ఓటమిచెందారు. అక్కడ కాంగ్రెస్‌కు చెందిన మరో నేత వెంకటేష్ మహారాజ్ విజయం సాధించారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణల్లో జాగ్రతలు తీసుకోవాలి

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

-జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించి సమీక్షలో పాల్గొన్న వైనం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే ప్రక్రియ చాలా జాగ్రత్తగా చేయాలని, మేడ్చల్‌జిల్లా మ్యాపింగ్‌లో 15శాతంచేసి వెనకబడి ఉందని రెండువారాల్లో 30శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిప్యూటీ సిఇఒ హుస్సేన్, ఐటి సెక్షన్ అధికారి చిరంజీవులు, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి సమీక్షాసమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002నుంచి ఉన్న ఓటరు జాబితాను 2025ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియను జాగ్రత్తగా చేయాలన్నారు. ఎఈఆర్ఓలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బిఎల్ఓలకు రోజువారి లక్ష్యాలను ఇచ్చి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బిఎల్ఓలతో ఇంటింటికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలన చేయటంతోపాటు ఫోటోలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్‌స్టేషన్ మ్యాపింగ్ ప్రక్రియలో క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో సెర్చ్ ఆప్షన్ ద్వారా హౌజ్‌నెంబరు, పేరు, ఇపిక్ నెంబర్ ద్వారా సెర్చ్ చేసే ఆప్షన్‌లో మ్యాపింగ్ కొంతసులువు అవుతుందన్నారు. అవసరమైన చోట అదనపు సిబ్బందిని, కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక నియోజకవర్గం నుంచి ఈఆర్ఓలతో మ్యాపింగ్ ప్రక్రియ ఏవిధంగా జరుగుతుందని, దీనిలో ఎదురవుతున్న సమస్యలు ఏమిటని అడిగి తెలుసుకున్నారు. ఏవిధమైన సహాయ సలహాలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఎపుడూ మీకు అందుబాటులో ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి స్పష్టంచేశారు.

## హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

-వివరాలు వెల్లడించిన ఎస్పీ స్నేహామెహ్రా

**వికారాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

హత్య కేసులో ఇద్దరు నిందితులకు రెండుసార్లు యావజ్జీవ కారాగార శిక్షను న్యాయమూర్తి విధించినట్లు జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా తెలిపారు. వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2014 సంవత్సరంలో గంగ్యాడ నాగమణి ఫిర్యాదు మేరకు, ఆమె భర్త ప్రభాకర్‌ను పాత కక్ష్యలు మనసులో పెట్టుకొని ఇద్దరునిందితులు కొట్టి చంపారనే ఆరోపణపై నవాబుపేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరస్థులుగా తేలిన ఇద్దరు నిందితులు కొత్తపల్లి లక్ష్మి, కొత్తపల్లి సత్యనారాయణకు రంగారెడ్డి జిల్లా ఎల్.బి.నగర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.భవాని కీలక తీర్పును ఇచ్చారని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఇట్టి కేసులోని హత్య నేరంలో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.15 వేలు జరిమానా, ఎస్సీ, ఎస్టీ చట్టం సెక్షన్‌లో కూడా ఇద్దరికీ జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.15 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఇద్దరు నిందితులకు రెండు సార్లు యావజ్జీవ కారాగార శిక్ష (జీవిత ఖైదు), ఒక్కొకరికి మొత్తం రూ.30 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని జిల్లా ఎస్పీపేర్కొన్నారు. ఈ కేసు యొక్క విచారణ, న్యాయస్థానంలో వాదనల కోసం కృషి చేసిన పిపి ఎస్.ప్రతాప్ రెడ్డి, అదనపు పిపి భద్రాద్రి, ఈకేసు దర్యాప్తులో విచారణాధికారులు చేసిన కృషి అభినంధనీయమన్నారు. మొదట ఎఫ్ఐఆర్ జారీ చేసిన 1వ విచారణాధికారి పి.శ్రీనివాస్, అప్పుడు నవాబ్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ, 2వ విచారణాధికారి, ఎవి.రంగారెడ్డి, ఇంచార్జ్ డిఎస్పీ వికారాబాద్, 3వ విచారణాధికారి అప్పటి వికారాబాద్ డిఎస్‌పి టి.స్వామి, పలువురు అధికారులను ఎస్పీ అభినంధించారు.

## అవుషాపూర్‌లో ఇంట్లో దొంగతనం.. బంగారం, నగదు చోరీ



చోరీ వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

**ఘట్‌కేసర్, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

ఇంటితాళం పగులగొట్టి బంగారు అభరణాలు, నగదు అపహరించుకుపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జిహెచ్ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ అవుషాపూర్‌కు చెందిన కేతావత్ శంకర్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు అభరణాలు, నగదును అపహరించుకుపోయారు. చోరీపై శుక్రవారం ఉదయం సమాచారం రావడంతో ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి ఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితునితో మాట్లాడి వివరాలు సేకరించారు. శంకర్ ఈనెల 3వ తేదీన నాగర్‌కర్నూల్‌లో ఉంటున్న తన పెద్దకూతురు ఇంటికి వ్యక్తిగత పనిమీద వెళ్లాడు. శుక్రవారం తిరిగి అవుషాపూర్‌కు తన ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో ఉన్న ఇనుపపెట్టెలోని బంగారు అభరణాలు నల్లపూసలదండ, బ్రాస్లెట్, గొలుసు అన్ని కలిసి సుమారుగా నాలుగున్నర తులాల బంగారం, కొంత నగదు, కొత్త బట్టలు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి పూట దొంగతనానికి పాల్పడి బంగారం ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జీరో కేసులు

-ఒక్క వివాదం కూడా లేకుండా పూర్తయిన ఎన్నికలు..

-ప్రశంసలు అందుకుంటున్న షాద్‌నగర్ పోలీసులు..

-కీలకంగా వ్యవహరించిన ఎసిపి, పట్టణ సిఐ

-వివాదాస్పద గ్రామాల్లోనూ ప్రశాంతంగా ఎన్నికలు



ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**షాద్‌నగర్, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

ఎన్నికలు అంటేనే వివాదాలు.. ఘర్షణలు.. కేసులు.. అరెస్టులు.. అభ్యర్థులు కావచ్చు.. వాళ్ళ అనుచరులు కావచ్చు.. గెలుపు కోసం కుమ్ములాడుకోవడం ఫలితాల కోసం సిగపట్లు చాలా చోట్ల చూశాం.. షాద్‌నగర్ నియోజవర్గం ఒకప్పుడు అయితే అందుకు పెట్టింది పేరు.. కానీ ఎన్నికల్లో తీరు మారింది.. ఒక్క వివాదం లేకుండా.. ఒక్క కేసు కూడా నమోదు కాకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యింది.. వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు వివాదాలకు తావులేకుండా ఎన్నికలఘట్టాన్ని పూర్తిచేయగలిగారు. ఈక్రమంలో షాద్‌నగర్ పోలీసులు ప్రశంసలు అందుకుంటున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలు చాలా ఉన్నాయి. ఈనియోజకవర్గంలో 36గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా అప్పట్లో పోలీసులు గుర్తించారు. ఇప్పటికి నియోజకవర్గంలో అవే సమస్యాత్మక గ్రామాలుగా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ, సిఐ విజయ్ కుమార్ వ్యూహాత్మకంగా, చాకచక్యంగా వ్యవహరించారు. ఫరూక్‌నగర్ మండలంలో సమస్యాత్మక గ్రామాలపై దృష్టిపెట్టడంతోపాటు వివాదాలకు ఆస్కారం ఉన్న గ్రామాలపై కూడా నిఘావేసి ఉంచారు. ఎక్కడ ఎలాంటి వివాదానికి ఆస్కారం ఉన్నా ముందుగా వెళ్లి అక్కడ సమస్యను పరిష్కరించే వివాదాలు రాకుండా ముందస్తుజాగ్రత్తలు తీసుకున్నారు. దీనికితోడు గ్రామాలలో రాపిడ్ యాక్షన్‌ఫోర్స్‌ను రంగంలోకిదించి అభ్యర్థులు ఎలా మసులుకోవాలి.. ప్రజలు ఎలా బాధ్యతగా ఉండాలి.. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి.. అన్న అంశాలపై గ్రామస్తులకు గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందే ఫార్వర్డ్ మార్చ్ అవగాహన కల్పించారు. వివాదాస్పద వ్యక్తులను ముందుగానే గుర్తించి వారిని బైండోవర్ చేసి గొడవలకు పాల్పడకుండా కట్టడిచేశారు. ఎన్నికలకు రెండురోజుల ముందు నుంచే గ్రామాలలో తిరిగి గ్రామాలను తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఎన్నికల రోజున ఉదయం 7 గంటలనుంచి రాత్రి ఎన్నికలప్రక్రియ పూర్త య్యేవరకు పూర్తిస్థాయిలో అప్రమత్తమై పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేలా కృషిచేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కకేసు లేకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పోలీసులతీరు ప్రశంసలు అందుకుంటున్నది. ఎసిపి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పట్టణ సిఐ విజయ్‌కుమార్ తదితర పోలీసుసిబ్బంది సహకారం అదేవిధంగా ప్రజల సహకారం అన్నీ వెరసి ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఫలితాలువెలువడ్డాయి. మొట్టమొదటిసారిగా రికార్డుపరంగా ఎలక్షన్లలో ఒక్కకేసు కూడా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్లో నమోదు కాలేదు. ప్రస్తుతం జీరో కేసులు. ఈ సందర్భంగా సిఐ విజయ్‌కుమార్‌తో మీడియా మాట్లాడగా ఆయన స్పందిస్తూ ప్రజల సహకారం మరువలేనిదని శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్‌శాఖకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**శామీర్‌పేట, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

శామీర్‌పేట నల్సార్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో శామీర్‌పేట గ్రామానికి చెందిన వల్లపు శ్రీనివాస్(52) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి శామీర్‌పేట గ్రామానికి చెందిన వల్లపు శ్రీనివాస్ (52) నల్సార్ రూట్‌లో పెద్దమ్మకాలనీ వైపునకు ఇంటికి బైక్‌పై వెళ్తుండగా శామీర్‌పేట అరణ్య రిసార్టువరకు చేరుకోగానే అశోక్‌లీలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనం అతివేగంగా నిర్లక్ష్యంగా (డ్రైవర్) నడుపుతూ వస్తూ ఆబైక్‌ను ఢీకొన్నట్లు, దీంతో తలకు, శరీరభాగాలకు తీవ్రగాయాలు అయి రక్తసిక్తం అయి అక్కడిక్కడే వల్లపు శ్రీనివాస్ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సర్పంచ్‌ని సన్మానించిన మాజీ బిఆర్ఎస్ మహిళానేత

**నందిగామ, డిసెంబరు 11, ప్రభాతవార్త:**

నందిగామ మండలంలోని రంగాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి గోవు అంజమ్మతో పాటు 10మంది వార్డ్ సభ్యుల్లో 9మంది బిఆర్ఎస్ వార్డు సభ్యులు గెలవడం సంతోషకరం అని బిఆర్ఎస్ సీనియర్ ఉద్యమ నాయకురాలు గడ్డం రాజ్యలక్ష్మి మ్మ అన్నారు. రాబోయే రోజుల్లో మండలంలో బిఆర్ఎస్ పార్టీ ప్రతి ఊర్లో గులాబి జెండా ఎగరవేయడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తంచేశారు.

## సుభాష్ నగర్ డివిజన్‌కి ఎస్సార్ నాయక్ నగర్ డివిజన్‌గా పేరు పెట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**జీడిమెట్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**

ఇటీవల డివిజన్ల మారుస్తూ సుభాష్ నగర్ డివిజన్‌గా సుభాష్ నగర్ ఏరియా లేనప్పటికీ సుభాష్ నగర్ పేరు పెట్టిన నేపథ్యంలో ఎస్సార్ నాయక్ నగర్ డివిజన్‌గా పేరు పెట్టాలని ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరి వెంకట శేషాచారి శుక్రవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ ఉప కమిషనర్ నరసింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. అన్ని రకాలుగా ఎస్ఆర్ నాయక్ డివిజన్ అయితే రెవెన్యూ పరంగా కూడా బావుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## క్రీడాకారులకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త**

రంగు రాజమ్మ సేవాసమితి ప్రతినిధులు ఇద్దరు క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం కోకో పోటీలో నేషనల్ లెవల్లో సెలెక్ట్ అయిన ఇద్దరు విద్యార్థినిలకు రంగు రాజమ్మ సేవా సమితి ప్రతినిధులు అండగా నిలిచి కొంత నగదును అందజేశారు. ఈనెల చివరి వారంలో మధ్యప్రదేశ్ జబల్పూర్ ప్రాంతంలో జరిగే అండర్ 19 కోకో పోటీలకు జీడిమెట్ల ప్రాథమిక పాఠశాలలో చదువుకునే శాంతి, మైథిలి ఇద్దరు సెలెక్ట్ కావడంతో వారికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం కొంత నగదును రంగు రాజమ్మ సాయిలు జ్ఞాపకార్థం అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, కళ్యాణి, ఫిజికల్ డైరెక్టర్ అరుణ జ్యోతి చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ గ్రామవాసి అశోక్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

**-సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి నారాయణ**



కార్మికులనుద్దేశించిర మాట్లాడుతున్న సీపీఐ మాజీ కార్యదర్శి నారాయణ

**నాచారం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** నాచారం పారిశ్రామికవాడలోని షాహి ఎక్స్పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికుల చేపట్టిన 5వ రోజు నిరసన ధర్నా కార్యక్రమానికి సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి నారాయణ శుక్రవారం విచ్చేసి పూర్తి మద్దతు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ. నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్ రెడ్డి,కె. ధర్మేంద్ర, రచ్చ కిషన్, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్ ఇతర ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. సిపిఐ జాతీయ నేత కె.నారాయణ సాయి ఎక్స్ ప్రెస్ మహిళా కార్మికులు చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నారని తెలుసుకొని ఆందోళన కార్యక్రమానికి వచ్చిన డిప్యూ టీ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్మెంట్ శ్యాంసుందర్ మాట్లాడుతూ షాహి ఎక్స్పోర్ట్స్ జీఎం మురళి లిఖిత పూర్వకంగా తమకు లేఖను రాసిచ్చారని తెలిపారు. వారం రోజుల గడువు కోరినట్లుగా, లేనియెడల లేబర్ ఆఫీస్ కి వచ్చి ఫిర్యాదు చేసి మళ్లీ మీ ఆందోళన కొనసాగించాలని మహిళ కార్మికులను శ్యాంసుందర్ కోరినట్లు తెలిపారు.

## 250 కిలో మీటర్లు రాకేష్ దత్త మహా పాదయాత్ర

**సైఫాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త:**



రాకేష్ దత్తను సత్కరిస్తున్న రాజేందర్

పెండింగ్‌లో ఉన్న 10 వేల కోట్ల ఫీజుల బకాయిలను ప్రభుత్వం వెంటన్ చెల్లించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ చెరుకుల రాజేందర్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడరాదని హెచ్చరించారు. తక్షణమే విడుదల చేయకపోతే ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నవంబరు 17వ తేదీ నుంచి ఖమ్మం నుంచి హైద రాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటి వరకు ఆ యూనివర్సిటి విద్యార్థి నాయకుడు రాకేష్ దత్త 250 కిలో మీటర్లు మహా పాదయాత్ర చేసి శుక్రవారం బిసి భవన్‌కు వచ్చిన సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రాకేష్ దత్తను, టిమ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు నారాయణ రావు, జి.బాలస్వామి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ కానుకలకు సర్కిల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలి

**నార్సింగి, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న క్రిస్మస్ కానుకలు పొందాలనుకునే వారు ఈ నెల 15.వ, తేదీలోపు స్థానిక సర్కిల్ కార్యాలయాలలో అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని డిసిలు కృష్ణమోహన్‌రెడ్డి, శరత్‌చంద్రలు పేర్కొన్నారు. క్రిస్మస్ సంబరాలకు రూ.లక్ష, చర్చి భవనానికి రంగులు వేసేందుకు రూ.20.వేలు, లైటింగ్‌కు రూ.10.వేలు ప్రభుత్వం ఆర్థిక సహాయం ఇవ్వనుందని వివరించారు. ఈ ప్రయోజనం పొందాలనుకునే వారు తమ చర్చీలకు సంబంధించిన రిజిస్ట్రర్ కాపీలు పెట్టి దరఖాస్తు చేసుకోవాలని కమీషనర్లు సూచించారు.

## చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

**గోషామహల్,డిసెంబర్ 12 ప్రభాతవార్త:**

చలికి తట్టుకోలేక ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సంఘటన గోషామహల్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది.ఎస్.ఐ అరవింద్‌గౌడ్ కథనం ప్రకారం...ముస్లింజంగ్‌పూల్‌లోని భగత్‌సింగ్ విగ్రహం సమీపంలో గత నెల 29వ తేదిన చలికి తట్టుకోలేక పడి ఉన్నాడు. పెట్రోలింగ్ డ్యూటిలో ఉన్న పోలీసు సిబ్బంది డి.బాబు,రాజేందర్‌రావులు గుర్తుతెలియని వ్యక్తి చికిత్సనిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు.చికిత్సపొందుతూ ఈనెల 9వ తేదిన మరణించినట్లు వైద్యులు ధృవీకరించడంతో మృతదేహాన్ని మార్చురీలో ఎ.ఎస్.ఐ రామచారి భద్రపర్చినట్లు తెలిపారు.మృతదేహంపై నీలిరంగుషర్టు, నల్లప్యాంటు ఉందన్నారు.ఈ కేసును గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటు అడ్డుకోవడం సమంజసం కాదు





సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ చౌదరియాదవ్

**సైఫాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** రవీంద్రభారతి ప్రాంగణంలో గాన గంధర్వుడు, పద్మ విభూషణ్ డా. ఎస్.పి.బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటును కొంత మంది తెలంగాణ వాదులు వ్యతిరేకించడాన్ని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు కుమార్‌చౌదరియాదవ్ తప్పుబట్టారు. బాలసుబ్రమణ్యం తెలుగు, హిందీ, కన్నడ తదితర భాషలకు సంబంధించిన అనేక పాటలు పాడి కోట్లాది మంది అభిమానుల హృదయాలలో నిలిచిపోయారని, ఆలాంటి మహానుభావుడు విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంటే ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అడ్డుకోవడం ధర్మం కాదన్నారు. ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవులు, కళాకారులు, రచయితలు, గాయకులు, జర్నలిస్టులకు కులాలు, మతాలు, ప్రాంతాలు, పశుపక్షాల బేధం ఉండవని స్పష్టం చేశారు. ప్రతి చిన్న విషయంలో ఆంధ్రవాడు గోబ్యాక్, మార్వాడివాడు గోబ్యాక్ అంటూ విమర్శలు చేస్తున్నారని, ఆదే ముస్లిం సోదరులను తురకోడా గోబ్యాక్ అనే దమ్ము, ధైర్యం వారికి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. తాము శాంతియుతంగా ఉంటున్నామని, ఇలా విమర్శిస్తూ పోతుంటే తాము చూస్తూ ఊరుకోనేది లేదని, ఇక సహించేది లేదని, గాజులు తొడుక్కొని లేమని ఆయన హెచ్చరించారు. వారు ఖాసీం రిజ్వీ వారసులా అని ఆయన నిలదీశారు. త్యాగాలు చేసిన వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఎవరైనా కోరవచ్చునని, కాని ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్న బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని వద్దని అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కావడంతో అన్ని ప్రాంతాల ప్రజలు ఇక్కడికి రావడం వల్లనే అభివృద్ధి చెందిందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి అయిన తరువాత ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సమితి నాయకులు కమలాకర్, ఆనంద్, అశోక్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## మహాదేవపురం డివిజన్(277)ను దేవేందర్‌నగర్ డివిజన్‌గా నామకరణం చేయాలి : మల్లేశ్



కుత్బుల్లాపూర్ ఎంఎల్ఏ కె.పి.వివేకానంద్‌ను కలిసి దేవేందర్‌నగర్ డివిజన్‌గా మార్చాలని కోరుతూ వినతిపత్రం సమర్పిస్తున్న దేవేందర్‌నగర్ సంక్షేమసంఘం అధ్యక్షులు మల్లేశ్ ,బస్తీవాసులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 12 ప్రభాతవార్త**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పడ్డ 300 కార్పొరేషన్ డివిజన్‌లలో మహాదేవపురం డివిజన్‌గా ప్రకటించిన దానికి తక్షణం దేవేందర్‌నగర్ డివిజన్‌గా పేరుమార్చాలని దేవవేందర్‌నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు మల్లేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు దేవేందర్‌నగర్‌కు చెందిన బస్తీవాసులు పెద్దఎత్తున శుక్రవారం కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్‌ను, గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం ఏర్పడ్డ దేవేందర్‌నగర్‌ను కాదని కొత్తగా ఏర్పడ్డ మహాదేవపురం కాలనీని డివిజన్‌గా రూపొందించడం వల్ల దేవేందర్‌నగర్ ఉనికికే ప్రమాదం ఏర్పడ్డట్టవుతుందని వారు ఆందోళన వ్యక్తంచేశారు. దేవేందర్‌నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు మల్లేష్, సంధ్య, పూనమ్మ,సంక్షేమసంఘ ప్రతినిధులు విఠల్,బాస్కర్, అంబదాస్, హనుమంతు, సూర్యలతోపాటు స్థానికులు పెద్దఎత్తున తరలివెళ్లి కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు, గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డిలకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా సంక్షేమ సంఘ అధ్యక్షులు మల్లేశ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ డివిజన్ మహాదేవపురం 277నుతక్షణం దేవేందర్‌నగర్ డివిజన్‌గా మార్చాలని కోరారు.లేదంటే యావత్ బస్తీవాసులు పెద్దఎత్తున జిహెచ్ఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దేవేందరనగర్ ఏర్పడ్డతరువాతే స్థానికంగా సిమెంట్‌రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయని, దేవేందర్‌నగర్‌కు మండల రెవెన్యూ కార్యాలయం సైతం తరలివచ్చిందని మల్లేష్ తెలిపారు.

## లలిత సంగీతరత్న విన్నకోట మురళి కృష్ణకు ఘంటసాల అవార్డు



లలిత సంగీతరత్న విన్నకోట మురళి కృష్ణ కు ఘంటసాల అవార్డు ప్రధానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త :** ఆనాటి ప్రముఖ భావ కవులు రాసిన పలు లలిత గీతాలకు స్వర కల్పన చేసి వర్ధమాన, ఔత్సాహిక గాయనీ గాయకుల చేత పలు లలిత సంగీత విభావరులలో పాడించిన విన్నకోట మురళీకృష్ణ లలిత సంగీత దర్శకుడుగా మంచి పేరు గడించారని వంశీ సంస్థ ల రథసారధి కళారత్న, శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు అన్నారు. ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ (ఇండియా) ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103 వ జయంతి సందర్భంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో జరిగింది. ప్రముఖ లలిత సంగీత దర్శకుడు, లలిత సంగీత రత్న విన్నకోట మురళీ కృష్ణ కు ఘంటసాల ఆవార్డు ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ఆ రోజుల్లో తమ వంశీ సంస్థ నిర్వహించిన పలు లలిత సంగీత విభావరులు విన్నకోట మురళీ కృష్ణ సంగీత దర్శకత్వంలో విస్తృతంగా జరిగాయని గుర్తు చేశారు. లలిత సంగీతం వ్యాప్తి చెందడానికి మురళీకృష్ణ చాలా కృషి చేశారని ఆయన అన్నారు. ఘంటసాల అవార్డు గ్రహీత మురళీ కృష్ణ మాట్లాడుతూ లలిత సంగీతం తనకు ప్రాణమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెలిగించవే చిన్ని వలపు దీపం పేరుతో వి.ఆర్.కె.ఫణి నిర్వహణలో స్వర్గీయ తెన్నేటి సుధాదేవికి ఘంటసాల పాటల స్వరానివాళి జరిగింది. నిర్వాహక మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గాయని గాయకులూ జె ఏ.శాస్త్రి , ఆర్. శ్రీధర్, టివి.రావు, టి.లలితరావు, నిషిజా రమణి, సవిత రవికుమార్, స్వర కళ్యాణి అద్భుతంగా గానం చేయగా హ్రిషికేష్ కారవోకే సహకారాన్ని అందించారు.

## ఇంటి వెనుక తాళాలు పగలగొట్టి చోరీ

**-రూ. 45 లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలు, 4 కిలోల వెండి చోరీ**

**మలక్ పేట, డిసెంబర్ 12, ప్రభాతవార్త:**

కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక తాళాలు పగలగొట్టి రూ 45 లక్షల నగదు, 15 తులాల బంగారు బిస్కెట్లు, ఆభరణాలు, 4 కిలోల వెండిని దొంగలించక పోయిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మలక్ పేట ప్రొఫెసర్స్ కాలనీలోని మానస అపార్ట్మెంట్స్ ఫ్లాట్ నెంబర్ 102 లో మంత్రవాది వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. కాగా గత నెల 13వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్ర కోసం తమిళనాడు, కేరళ, గోవాకు వెళ్లారు తిరిగి ఈనెల బుధవారం రాత్రి మలక్ పేట ప్రొఫెసర్స్ కాలనీలోని తన ఫ్లాట్ కు రావడం జరిగింది. ఇంటి తాళాలు తెరిచి లోపలికి వెళ్లి చూడగా ఇంటి వెనుక వైపు బాల్కనీ తలుపులు పగలగొట్టి కనిపించాయి. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు గదిలోని బీరువా వద్దకు వెళ్లి చూడగా అది కూడా పగలగొట్టబడి ఉంది. అనుమారా లో ఉన్న రూ. 45 లక్షల నగదు, పది తులాల బంగారు బిస్కెట్లు (ఒకటి ఏడు తులాల బంగారు బిస్కెట్, మరొకటి మూడు తులాల బంగారు బిస్కెట్), రెండు తులాల బంగారు గాజులు, మూడు తులాల బంగారు నాణాలు, 4 కిలోల వెండి చోరీకి గురవడంతో బాధితుడు మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో మలక్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీమ్స్ బృందాలను రప్పించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. సంఘటన ప్రాంతాన్ని మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్, డిఐ జయశంకర్‌లు తమ సిబ్బందితో కలిసి సందర్శించి వివరాలను సేకరించారు. నేపాల్ కు చెందిన వాచ్ మెన్ పై అనుమా నం కాగా అపార్ట్మెంట్స్‌లో నేపాల్ చెందిన అర్జున్ అనే వ్యక్తి కొంత కాలం నుంచి వాచ్మెన్ గా పనిచేస్తున్నాడని, ఉన్నట్టుండి చెప్పా పెట్టకుండా ఉద్యోగాన్ని మానేసి వెళ్లిపోవడంతో అతని ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని బాధితుడు వెంకటరమణ అనుమానాలు వ్యక్తం చేశారు.

## వ్యాపారం పేరుతో కోటికి పైగా ఎగనామం

**-న్యాయం చేయాలంటూ బాధితుడు రామకృష్ణ ఆవేదన**

**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:**

తన దగ్గర ఒక సంవత్సరం నుండి మొక్కజొన్న ముప్పై లారీల లోడ్ తీసుకొని, ఒక కోటి ఏనబై తొమ్మిది లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, సెటిల్ మెంట్ పేరుతో రెండు నెలల క్రితం ఆరామ్ ఘర్ లోని వారి ఇంటికి పిలిచి ముగ్గురు సోదరులు డబ్బులు ఇవ్వకుండా చివరికి తనపైనే అక్రమాలకు, బెదిరింపులకు దిగుతున్నారని న్యాయం చెయ్యాలని బాధితుడు రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్టం లోని చిక్ బళ్లాపూర్ పెరే సంద్రం లో తాను మొక్కజొన్న వ్యాపారం చేస్తానని, రైతుల నుండి కొనుగోలు చేసి హైదరాబాద్ ఆరామ్ ఘర్ కు చెందిన ముగ్గురు సోదరులు అక్బర్, నాసిర్, అహ్మద్‌లకు చెందిన రెండు కంపెనీ లకు విక్రయిస్తానని తెలిపారు. ఐతే తొమ్మిది లారీల మొక్కజొన్న లోడ్ ను తాను పంపాక తనకు చెల్లించాల్సిన నగదులో ఒక కోటి ఎనభై తొమ్మిది లక్షల రూపాయలు ఇంకా ఇవ్వాల్సి ఉందని, ఆ సొమ్మును చెల్లించమని అడిగితే, ఆరామ్ ఘర్ లోని తన ఇంటికి వచ్చి డబ్బులు సెటిల్మెంట్ చేసుకోవాలని పిలిపించుకున్న పిదప, తనకు డబ్బులు ఇవ్వాల్సింది పోయి తన పైనే కేసులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చాలా మంది రైతుల వద్ద నుండి సేకరించిన మొక్కజొన్న లోడ్ లకు సంబందించి వారికి నగదు చెల్లించాల్సి ఉందని, తన లోడ్ కొనుకున్న ఈ సోదరులు డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని, తాను ఇప్పటి వరకు ఎన్ని పోలీస్ స్టేషన్లు తిరిగినా తనకు న్యాయం జరగట్లేదని ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తనకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

## నిమ్స్‌లో కొనసాగుతున్న నర్సింగ్ ఉద్యోగుల శాంతియుత ఆందోళన

**జూబ్లీహిల్స్, డిసెంబరు 12, ప్రభాతవార్తః**



శాంతియుత ఆందోళనలో నిమ్స్ ఆసుపత్రి నర్సులు

నిమ్స్ ఆసుపత్రిలో నర్సింగ్ ఉద్యోగుల శాంతియుత ఆందోళన కొన సాగుతుంది. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుంచి నర్సింగ్ ఉద్యోగులు శాంతియుత ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ప్రతి రోజు ఏదో ఒక సమయంలో వారు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే వారి దీర్ఘకాలిక డిమాండ్‌లలో ఒకటైన నర్సింగ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నిమ్స్‌లో ఉచిత చికిత్స అందించేందుకు అవసరమైన వివరాలను అందించాలంటూ డైరెక్టర్ రెండు రోజుల క్రితం సర్క్యులర్ జారీ చేశారు. కాగా తమ ఆందోళనను విరమించేది లేదని, తమ డిమాండ్లన్నింటిని పరిష్కరించాలని మరోవైపు నర్సింగ్ యూనియన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. అప్పటివరకు తమ శాంతియుత ఆందోళన కొనసాగుతుందని నర్సింగ్ యూనియన్ అధ్యక్షురాలు ఆశలత తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు.

## గందరగోళంగా మారిన గోషామహల్ డివిజన్‌ను సరి చేయాలి



డిప్యూటి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

**గోషామహల్,డిసెంబర్ 12ప్రభాతవార్త:**

గోషామహల్ డివిజన్‌ను గందర గోళంగా మార్చిన జిహెచ్ఎంసి అధికారులని గోషామహల్ నియోజకవర్గం బిజెపి సీనియర్ నాయకులు డి.గోపాల్‌జీఆరోపించారు.జిహెచ్ఎంసి ప్రక్షాళన పేరుతో ఇష్టానుసారంగా సరిహద్దులను కలిపి గందరగోళానికి గురిచేశారని పలువురు ఆరోపిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటిలను గ్రేటర్ హైదరాబాద్ మహనగర పాలకసంస్థలో వీలినం చేస్తున్నట్లు జి.ఓ జారీచేసి ప్రజలు,పార్టీ నాయకుల అభిప్రాయాలను తీసుకోకుండా ఇష్టాను సారంగా డివిజన్‌లను అయోమయంగా మార్చివేసినట్లు దుయ్యబట్టారు.గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహానగరపాలక సంస్థ కమీషనర్,డిప్యూటి మున్సిపల్ కమీషనర్లును కలిసి వినతిపత్రాలను అందచేశారు. గోషామహల్ మున్సిపల్ డివిజన్‌లో 65వేల ఓటర్లను చేర్చి, కొత్తగా రూపొందించినఎగ్జిబిషన్‌గ్రౌండ్స్ డివిజన్‌లో 25వేల ఓటర్లను చేర్చడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. నియమనిబంధనల ప్రకారం ప్రతి డివిజన్‌ను 40వేలకు మించి ఉందవద్దని అధికారులే అంటున్నారు.ఇలా ఒక డివిజన్‌లో 65వేలు,మరోడివిజన్‌లో 25వేల ఓటర్లను ఎలా చేర్చుతారని ప్రశ్నించారు.అధికారులు ఇప్పటికైనా గోషామహల్ డివిజన్‌లోని 14-1వార్డు,14-2,14-4,5-3,5-4 వార్డులను జైన్ మందిరం,రాణా ప్రతాప్‌కమ్యూనిటిహాల్, చందన్‌వాడి, జ్ఞాన్‌బాగ్ కాలనీ,పాన్‌మండి, జోషివాడి,ఆర్యసమాజ్, లక్ష్మినారాయణ బాగ్,హజారిభవన్ గోషామహల్ డివిజన్ చేర్చాలనిడిమాండ్ చేశారు.ఏకంగా వార్డుల మధ్య ఓటర్ల సంఖ్యలో గణనీయమైన వ్యత్యాసం ఉందన్నారు.లేనిపక్షంలోగోషామహల్ ప్రజలతో కలసి ఆందోళన చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గోషామహల్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే విద్యార్థుల సరైన గమనం

**- అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి**



క్రీడా వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆచార్య ఘంటా చక్రపాణి, గోపాలకృష్ణన్, శ్రీలతానాయర్, రమాదేవి తదితరులు.

**జూబ్లీహిల్స్, డిసెంబరు 12, ప్రభాతవార్తః**

క్రమశిక్షణతోనే విద్యార్థులు సరైన గమనంలో ముందుకు వెళ్తారని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, మాజీ టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శుక్రవారం వార్షిక క్రీడోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సింక్రోనీ-వన్ అవర్, వన్ టీమ్-వన్ స్పిరిట్ థీమ్‌తో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఏకతా, సహకారం, సమన్వయాన్ని అద్భుతంగా ప్రతిబింబించారు. ఈ సందర్భంగా ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. భవన్స్ విద్యా సంస్థ విలువలతో పాటు సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని సమ్మిళితం చేస్తూ క్రీడలను పాఠ్య కార్యక్రమంలో భాగం చేస్తుందని, తద్వారా క్రమశిక్షణతో కూడిన విద్యావంతులుగా తీర్చిదిద్దుతుందన్నారు. స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎస్. గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ 50 శాతం సమయాన్ని మైదానంలో గడపాలని, దీనివల్ల శారీరక దారుఢ్యంతో పాటు జీవిత నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. విద్య విద్యార్థుల శారీరక, మానసిక, మానవీయ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత నాయర్ పాఠశాల సాధించిన విజయాలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథి పాఠశాల జెండా ఎగురవేసి, క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఫిట్ ఇండియా థీమ్‌తో నిర్వహించిన డ్రిల్లులు, ప్రదర్శనలు, క్రమశిక్షణ, అందరిని ఆకట్టుకున్నాయి. యూనిటీ ఇన్ మోషన్, స్ట్రెంగ్త్ ఇన్ రిథమ్ వంటి భావాలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ట్రాక్ ఈవెంట్స్, రిలేలు, ఫీల్డ్ పోటీల్లో వివిధ హౌస్‌ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో భవన్స్ హైదరాబాద్ కేంద్ర కో-ఆర్డినేషన్ రమాదేవి, హెడ్ గర్ల్ రితిషారెడ్డి పాల్గొన్నారు.

## అయ్యప్ప నామస్మరణంతో మారుమ్రోగిన నెమలీనగర్



పుప్పాలగూడ నెమలీనగర్‌లో జరిగిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు.

**నార్సింగి, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామం నెమలీనగర్‌లో శుక్రవారం కలియుగ ప్రత్యక్ష దైవమైన హరిహర తనయుడు శ్రీ అయ్యప్ప స్వామి నామ స్మరణంతో మారుమ్రోగిపోయింది. అయ్యప్ప స్వామి పడిపూజ ఉదయం 9.గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గ్రామం అంతా అయ్యప్ప భజన పాటలే వినిపించాయి. అయ్యప్ప స్వాములు, భక్తులు, పుర ప్రముఖులు, మహిళలు పెద్ద ఎత్తున ఈ మహా పడిపూజలో పాల్గొని ధన్యులయ్యారు. అయ్యప్పలు పోటాపోటీగా భజన పాటలు పాడి భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తారు. స్వాములతో పాటు సాధారణ ప్రజలు, భక్తులంతా పాటలు పాడి, ఆడి పరవశించిపోయారు. ఈ పడిపూజలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నాయకులు కొండకల్ల రామకృష్ణారెడ్డి, క్యాతం అశోక్ యాదవ్, కె.నరేందర్‌రెడ్డి, సాయి తదితరులు అరుణ్ తదతరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మల్లేష్, రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ భక్తితో కొలిచిన వారి కోరికలు తీరుస్తున్న కలియుగ దైవం అయ్యప్ప స్వామి భక్తులు ఏటేటా పెరుగుతూనే ఉన్నారన్నారు. కాలంతో సమానంగా పరుగులు పెడుతున్న నేటి కంప్యూటర్ యుగంలో సైతం యువతరం ఆధ్యాత్మికత వైపుకు ఆకర్షితులవడం, సనాతన ధర్మంను ఆచరించడం గర్వంగా ఉందన్నారు. మనధర్మంను పాటిస్తూ, మన వారసులతో ఆచరింపచేయాలని భక్తులకు సూచించారు. వందలాది మంది మాల ధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి కరుణా,కటాక్షాలకు పాత్రులయ్యారు.

## జైస్వాల్ వార్షిక సమావేశానికి ఆహ్వానం



టి.పి.సి.సి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన బొకె అందచేసిన జైస్వాల్ ప్రతినిధులు రాకేష్‌జైస్వాల్

**అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 12 ప్రభాతవార్త:**

జైస్వాల్ వార్షిక సమ్మేళన మహా సభకు తెలంగాణ టి.పి.సి.సి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మర్యాద పూర్వకంగా జైస్వాల్ సభ ప్రతినిధులు కలిశారు.బాగ్‌లింగం పల్లి ఆర్టీసి కళ్యాణ మండపంలో ఈనెల 21వ తేదిన జరిగే సభకు టి.పి.సి.సిమహేష్ కుమార్‌గౌడ్‌ను జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, స్వరూప్ జైస్వాల్, దేవేందర్ జైస్వాల్, మహేష్ జైస్వాల్ లు కలిసిశాలువ కప్పి సన్మానించారు.తెలంగాణలోని జైస్వాల్ కులస్థులు,వివిధరంగాలల్లో కొనసాగుతున్న జైస్వాల్ పాల్గొంటారన్నారు.

## రాజ్యాధికార పార్టీ యూత్ అధ్యక్షుడుగా చంద్రశేఖర్



తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న రాజ్యాధికార పార్టీ యూత్ అధ్యక్షుడుగా బొడ్డుపల్లి చంద్రశేఖర్, చిత్రంలో సుధగాని గౌరిశంకర్‌గౌడ్,వీరమల్ల అనిల్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడుగా బొడ్డుపల్లి చంద్రశేఖర్ నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా వీరమల్ల అనిల్‌కుమార్‌లను నియమించారు. ఈ మేరకు వారి నియామకాలను రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ధృవీకరించాడు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ మాటాడుతూ పార్టీ అభివృద్ధి,నిర్మాణానికి అంకితభావం,నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు.తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాలాజీ మందిరంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు

**చార్మినార్,డిసెంబరు 12 ప్రభాతవార్త :**

చార్మినార్ సమీపం లోని శ్రీ బాలాజీ మందిరంలో ఈ నెల 30వ తేదీన అత్యంత వైభవంగా శ్రీ ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను నిర్వహించనున్నామని మందిరం ప్రధాన పూజారిశృంగారం ఆత్రేయ రమణాచారి,పూజారి శృంగారం ఆత్రేయ చారిలు తెలిపారు.డిసెంబరు నెల 30వ తేదీ మంగళవారం తెల్లవారు జామున మూడు గంటలకు సుప్రభాతం,4 గంటలకు తోమాల సేవ,6 గంటలకు నేత్ర దర్శనం, హారతి,ఉదయం 6.30 గంటలకు స్వామి వారి వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం మరియు పల్లకి ఊరేగింపు,ఆలయ తిరువీధులలో అతి వైభవంగా జరుగుతుందని వారు తెలియజేశారు.జనవరి ఒకటివ తేదీన నమ్మాళ్‌వార్ పరమపద మహోత్సవం,జనవరి 14వ తేదీన శ్రీ గోదాదేవి కళ్యాణం,16 వతేదీ శుక్రవారం శ్రీ కరినోము జరుగుతుందని వారు తెలిపారు.భక్తులు వైకుంఠ మహోత్సవాలలో పాల్గొని స్వామి వారిని సేవించి తరించగలరని వారు తెలియజేశారు.

## బిసి,ఎస్సి,ఎస్టీ గ్రేటర్ హైదరాబాద్ చైతన్య వేదిక ఉపాధ్యక్షులుగా రాధాక్రిష్ణ



రాధాక్రిష్ణకు నియమాక పత్రాన్ని అందజేస్తున్న చైతన్య వేదిక ఫౌండర్ అధ్యక్షులు కె.హరినాథ్

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 12 ప్రభాతవార్త :**

బిసి,ఎస్సి,ఎస్టీ గ్రేటర్ హైదరాబాద్ చైతన్య వేదిక ఉపాధ్యక్షులుగా పాతబస్తీకి చెందిన సిరుసాలా రాధాక్రిష్ణ నియమితులయ్యారు.కాటేదాన్‌లో జరిగిన కార్యక్రమంలో బిసి,ఎస్సి,ఎస్టీ చైతన్య వేదిక ఫౌండర్ అధ్యక్షులు కె.హరినాథ్ పాతబస్తీ లాల్‌దర్వాజ ప్రాంతానికి చెందిన రాధాక్రిష్ణకు నియమాక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిసి,ఎస్సి, ఎస్టీ గ్రేటర్ హైదరాబాద్ చైతన్య వేదిక ఉపాధ్యక్షులుగా నియమితులైన రాధాక్రిష్ణ మాట్లాడుతూ తనను బిసి,ఎస్సి,ఎస్టీ గ్రేటర్ హైదరాబాద్ చైతన్య వేదిక ఉపాధ్యక్షులుగా నియమించినందుకు వేదిక ఫౌండర్ అధ్యక్షులు హరినాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు.సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.ఆనంద్, స్థానికులు జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన రామ్ గానామృతం

**చిక్కడపల్లి డిసెంబర్ 12 (ప్రభాతవార్త) :**





గానం చేస్తున్న రామ్ దూర్వాసుల

స్వరలహరి సంస్థ నిర్వాహకులు అమెరికా వాస్తవ్యులు రామ్ దూర్వాసుల శుక్రవారం శ్రీ ముఖ కాంప్లెక్స్ లోని అల్లాయిడ్ ఆడిటోరియం లో గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రమణ్యం ,ఘంటసాల పాడిన పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రోతలూగించారు. పాత పాటలు పాడి మన తెలుగు సాహిత్యం ఎంతో గొప్పదని కొనియాడారు. తాను విదేశాలలో ఉన్నప్పటికీ తెలుగు భాష పై ఉన్న మక్కువతో భారత దేశం వచ్చినప్పుడల్లా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రేవతి,శ్రీదేవి,శారదా సాయి పాల్గొన్నారు.

# నేడు నగరానికి లియోనెల్ మెస్సీ

-ఫుట్‌బాల్ ఈవెంట్‌కు కట్టుదిట్టమైన భద్రత
-450 సీసీ కెమేరాలు, డ్రోన్లతో స్టేడియంలో నిఘా
-మెస్సీకి జడ్ కేటగిరీ భద్రత
-పాస్‌లున్న వారికే స్టేడియంలో ప్రవేశం




**హైదరాబాద్ డిసెంబరు 12 ప్రభాతవార్త:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో ఉప్పల్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడనున్నారు. దీంతో నగరం ఆ క్షణాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హైదరాబాద్ పర్యటనకు రానున్న మెస్సీ షెడ్యూల్ ప్రకారం..శనివారం మధ్యాహ్నం 3 నుండి 4 గంటల మధ్య కోల్‌కత్తా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. అక్కడ నుండి నేరుగా తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లనున్నారు. అక్కడ గంటపాటు అభిమానులతో ప్రత్యేకమైన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెస్సీతో ఫోటో దిగేందుకు 10 లక్షల రూపాయలు చెల్లించి ముందుగానే స్లాట్లు బుక్ చేసుకున్న 100 మంది అదృష్టవంతులతో స్టార్ ప్లేయర్ ముఖాముఖీగా మాట్లాడి, ఫోటోలు దిగనున్నాడు.ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు మెస్సీ ఉప్పల్ స్టేడియంకు చేరుకుంటారు. అక్కడ చిన్నారుల ఫుట్‌బాల్ జట్టుతో 15 నిమిషాల పాటు సంభాషించి, కొన్ని మెళకువలు తెలపనున్నాడు. ఆపై సాయంత్రం 7 గంటలకు ప్రధాన ఈవెంట్ ప్రారంభం కానుంది. 7.30కి ప్రత్యేక మ్యాచ్ జరుగనుంది. సింగరేణి జట్టుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం వహిస్తుండగా.. అపర్ణ మెస్సీ టీమ్ తరఫున మెస్సీ ఆడనున్నారు. మెస్సీతో పాటు అతని స్నేహితులైన రోడ్రిగో, లూయిస్ సురేజ్ కూడా ఈ మ్యాచ్‌లో పాల్గొనబోతున్నారు.

అయితే మ్యాచ్ చివరి ఐదు నిమిషాల్లో మాత్రమే మెస్సీ, సీఎం రేవంత్ రెడ్డి గ్రౌండ్‌లోకి ప్రవేశించి ఆడనున్నారు. మ్యాచ్ అనంతరం విజేత జట్టుకు ట్రోఫీని మెస్సీ, రేవంత్‌రెడ్డి కలిసి ప్రధానం చేయనున్నారు. ఈవెంట్ ముగిసిన తర్వాత మెస్సీ తిరిగి ఫలక్‌నుమాకు వెళ్లి అక్కడే రాత్రి బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం ముంబైకి పయనమవుతారు. మొత్తంగా నగరవాసులకు, ఫుట్‌బాల్ లవర్స్‌కు పండుగగా నిలువనుంది.

## పటిష్ట భద్రతా ఏర్పాట్లు...

ఉప్పల్ స్టేడియంలో శనివారం జరగబోయే అంతర్జాతీయ ఫుట్బాల్ ఈవెంట్ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. మెస్సీకి జట్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని, ఆయన్ని గ్రీన్ ఛానల్ ద్వారా స్టేడియంకు తీసుకువస్తామని సీపీ తెలిపారు. అయితే, వాహనంలో ఉన్నప్పుడు కూడా మెస్సీని చూసే అవకాశం ప్రేక్షకులకు ఉండదని, కాబట్టి అనవసరంగా రోడ్డుపైకి వచ్చి చూసే ప్రయత్నం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.స్టేడియం సామర్థ్యం 39 వేలు అని, దానికి తగ్గట్టుగానే నిర్వాహకులు పాస్‌లు అమ్ముతున్నారని, అయితే స్టేడియం దగ్గర ఎలాంటి పాస్‌లు అమ్మబడవని, కేవలం ఆన్‌లైన్ లోనే పాసులు అమ్మబడతాయని క్లారిటీ ఇచ్చారు. పాసులు ఉన్నవారు మాత్రమే రావాలని, లేనివారు స్టేడియం వద్దకు రావద్దని స్పష్టం చేశారు సీపీ. భద్రత కోసం స్టేడియం పరిసరాల్లో 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మోస్ట్ అడ్వాన్స్ డ్రోన్లతో కూడా నిఘా పెడుతున్నట్లు చెప్పారు.శనివారం సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుందని, సాయంత్రం 4 గంటల నుంచే ప్రేక్షకులను లోపలికి అనుమతిస్తామని సీపీ పేర్కొన్నారు.

మెస్సీ కొద్దిసేపు మాత్రమే ఆడతారు కాబట్టి, ప్రేక్షకులు ముందస్తుగానే స్టేడియం చేరుకోవాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ల్యాప్‌టాప్‌లు, బ్యానర్లు, వాటర్ బాటిళ్లు, కెమెరాలు, సిగరెట్లు, గొడుగులు, లైటర్లు, బైనాకులర్లు, బ్యాటరీలు, హెల్మెట్, బ్యాగ్ వంటి వస్తువులకు స్టేడియం లోపలికి అనుమతి లేదని, కేవలం మొబైల్ ఫోన్లను మాత్రమే అనుమతిస్తున్నట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు.

## నిరుద్యోగ జాబ్ మేళాకు విశేష స్పందన

### 2,100 మందికి ఉద్యోగ అవకాశాలు

**ముషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** ప్రముఖ సంఘ సేవకులు టి.దినకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ జాబ్ మేళా కు వేలాది మంది నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన వచ్చింది. ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ప్యాలెస్‌లో నిర్వహించిన ఈ మేళాలో 195 కంపెనీలు పాల్గొనగా, 5,200 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,010 మందికి ఉద్యోగ అవకాశా లు కల్పిస్తూ నియామక పత్రాలు అందచేశారు. అనంతరం దినక ర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల లక్షలాదిమంది చదువుకున్న యువత ఇబ్బందులు పడుతు న్నారని, వారికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ఐటీ కంపెనీలు, ప్రైవేట్ ఆసుప త్రుల యాజమాన్యాలు, ఇతర ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలతో మాట్లాడి, ఈ జాబ్ మేళా ఏర్పాటుచేయటం జరిగిందని తెలిపారు. రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పించటం ఎంతో ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు నిర్వ హించి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తా నని తెలిపారు.

## రెవెన్యూశాఖామంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

**ముషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** రెవెన్యూ మంత్రి కుమారుడికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేసిన అరాచకంకు బాధ్యత వహిస్తూ రెవెన్యూశాఖా మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయి బాబా డిమాండ్ చేశారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశం లో ఆయన మాట్లా డుతూ రంగారెడ్డిజిల్లాలోని గండిపేట మండల పరిధి లో అత్యంత విలువైన భూమని డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కోసం రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ తీవ్రంగా వత్తిడి చేసినా, స్వయంగా రెవెన్యూ మంత్రి రంగంలోకి దిగి బెదిరించినా, భూయజమాని వినకపోవటంతో మంత్రి కుమారుడు భూయజమాని ఇంటికి వెళ్లి, దౌర్జన్యానికి పాల్ప డటం దారుణ మన్నారు. భూయజమాని న్యాయం కోసం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా కూడా దౌర్జన్యానికి పాల్పడటం చట్టాన్ని అపహాస్యం చేయటమేనని, ఈ విధంగా మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని, అధికార దుర్వినియోగానికి పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. భూదందాలకు, అధికార దుర్విని యోగానికి పాల్పడుతున్న రెవెన్యూ మంత్రిని తక్షణమే కేబినేట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఈ-వ్యర్థం.. అనర్థం

## -రీ సైక్లింగ్ పై అవగాహన లేమితో జల, వాయు, నేల కలుషితం

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త** మహానగరానికి ఎలక్ట్రానిక్ వ్యర్థాల ముప్పు పెరుగుతోంది. ఏటా వ్యర్థాలు పోగుపడుతుంటే రీసైక్లింగ్‌లో సరైన విధానాలు అవలంబించక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాడి పారేస్తున్న సెల్ ఫోన్లు, టీవీలు, విద్యుత్తు పరికరాలు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడంలో పీసీబీ, మున్సిపల్, ఇతర విభాగాల అలసత్వం, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో కాలుష్యం పెరిగిపోతోంది. పారేసిన బ్యాటరీ ఓ జలాశయాన్ని కలుషితం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### సింహభాగం నగరం నుంచే..

ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతోంది. తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నులను దాటి ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా తర్వాత దేశంలో మూడో అతిపెద్ద వ్యర్థాల ఉత్పత్తిదారుగా రాష్ట్రం నిలిచిందని లోక్‌సభలో పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్స రం నాటికి 1.19లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని వెల్లడించింది. ఈ వ్యర్థాలన్నీ ఐటీ రంగానికి కేంద్రంగా ఉన్న రాజధాని నుంచే ఉత్పత్తి అవుతున్నాయి.

### 20శాతంలోపే..

వ్యర్థాల రీసైక్లింగ్ కోసం కాలుష్య నియంత్రణ మండలి 31 సంస్థలకు అనుమతులివ్వగా అందులో 20కి పైగా రాజధాని పరిధి లో నే ఉన్నాయి. వీటికి ఏటా 2.25 లక్ష ల




టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే సామర్థం ఉంది. అయి నా 40వేల మెట్రిక్ టన్నులకు మించి రీసైక్లింగ్ చేయడం లేదు. పీసీబీ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2023-24లో ఎక్స్టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్)లో భాగంగా 63,635 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరించారు. ప్రాసెస్ చేసిన ఈ వ్యర్థాల్లో బంగారం, రాగి, అల్యూమినియం, ఇనుము, వంటి లోహాలు 24,497 మెట్రిక్ టన్నులుం డగా ఇతర వ్యర్థాలు 24,433 మెట్రిక్ టన్ను లున్నాయని పేర్కొంది.

### కాలుష్యంతో సమస్యలిలా..

ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వంటి విషపూరిత పదార్థాలుంటాయి. వీటిని రీసైకిల్ చేయకపోతే నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. సీసం నీటి వనరుల్లో కలిస్తే నీటి కాలుష్యానికి దారి తీయడంతో పాటు జలచరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తాయి. ఈ రసాయ నాలు నేలలో చేరి దాని సారాన్ని దెబ్బ తీస్తాయి. వీటిని కాల్చడం, అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైకిల్ చేయడం వల్ల డైఆక్సిన్లు, ఫ్యూరాన్లు వంటి విష పూరిత వాయువులు విడుదలై గాలిని కలుషితం చేస్తాయి. దీంతో క్యాన్సర్, నాడీ వ్యవస్థ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు దారితీస్తాయి.

# జిహెచ్ఎంసికి నీటి కొరత..

-ప్రధాన కార్యాలయంలో వాటర్ ట్యాంకర్లపైనే ఆధారం
-ప్రైవేట్ నుంచి రోజుకు 20 నుంచి 30 ట్యాంకర్లు
-మెయింటనెన్స్ విభాగంపై తీరుపై సర్వత్రా విమర్శలు



జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయానికి క్యూకట్టిన ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్

**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నీటి సమస్య కొనసాగుతుంది. గత మూడు రోజులుగా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల పైనే ఆధాడి రోజుకు 20 నుంచి 30 ట్యాంకర్ల నీరు తెప్పిస్తున్నారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ కి వచ్చే పైప్ లైన్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకనే సరఫరా ఆగిపోయినట్లు అధికారులు గుర్తించారు. ప్రధాన కార్యాలయంలో నీటి సరఫరాతో గత మూడురోజులుగా ఇబ్బంది పడుతున్నారు. జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏడు ఫ్లోర్లలో కలిసి 95 బాత్ రూమ్స్ ఉండటంతో ప్రైవేట్ ట్యాకర్ల నీరు కూడా సరిపోని పరిస్తితి నెలకొంది. కావున ఉన్నతాధికారులు పట్టించుకుని వెంటనే నీటి సమస్య తీర్చాలని సిబ్బంది కోరుతున్నారు. అయితే వాటర్ బోర్డు ట్యాంకర్లు బుక్ చేస్తే లేట్ అవుతుందని... ప్రైవేట్ ట్యాంకర్లు బుక్ చేస్తున్నామని జీహెచ్ఎంసీ మెయింటెనెన్స్ అధికారులు చెబుతున్నారు.అలాగే వాటర్ బోర్డు అధికారులు సైతం ట్యాంకర్లు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని కానీ ఇప్పటికీ మమ్మల్ని సంప్రదించలేదని చెబుతున్నారు. అలాగే ప్రైవేట్ ట్యాంకర్ల కు నగరంలో అనుమతే లేదని... జీహెచ్ఎంసీ అధికారులు జలమండలి కాదని ప్రైవేట్ ట్యాంకర్లు బుక్ చేసి డబ్బులు వృధా అని డబుల్ రేట్ తో వాటర్ ట్యాంకర్లు బుక్ చేయడం వెనక అంతర్యమేమిటో తెలియడం లేదని తెలుపుతున్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి

### -గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి



ఉచిత సహాయ కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

**సికింద్రాబాద్, డిసెంబర్ 12 ప్రభాతవాం** యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డేను పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపు మేరకు గాంధీ ఆస్పత్రిలో లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత సహాయ, సేవా కార్యక్రమాలు శుక్రవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య అవసరాలకు సంబంధించిన అనేక సూచనలు ఎల్లప్పుడు అందించడానికి కృషి చేస్తామని, సరియైన వైద్యం రోగి యొక్క హక్కు అని తెలిపారు. తమ వైద్యుల బృందం ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రోగి ఆరోగ్యం కాపాడటానికి చేయవలసిన చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నాణ్యమైన వైద్య సేవలను సిబ్బంది ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం లీగల్ సెల్ లాయర్ జగదాంబ మాట్లాడుతూ డాక్టర్స్ యొక్క కృషిని కొనియాడారు. ప్రతి రోగికి చికిత్స చేసుకునే హక్కు ఉందన్నారు. ప్రతి వైద్య పరీక్ష, రక్త పరీక్షలు వంటి వివరాలు సంబంధిత వైద్య సిబ్బంది ద్వారా అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరికి ఉచితంగా అన్ని ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం అవుట్ పేషంట్ విభాగంలో గర్భిణీ స్త్రీలకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యంఓ డాక్టర్ శేషాద్రి, డాక్టర్ యోగి, డాక్టర్ నవీన్ , పారా లీగల్ వాలంటీర్ ఈశ్వరమ్మ , నర్సింగ్ ఆఫీసర్ మణి స్టాఫ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లోనూ వార్డుల విభజనపై ఫిర్యాదుల స్వీకరణ

**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ వార్డుల డిలిమిటేషన్‌పై వచ్చే ఫిర్యాదులను సెలవుదినాలైన ఈ నెల 13, 14 వ తేదీన కూడా స్వీకరించనున్నట్లు జీహెచ్ఎంసీ ప్రకటించింది. ఈ నెల 13,14 తేదీలలో కూడా ఫిర్యాదులను స్వీకరించేందుకు కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు జిహెచ్ఎంసి అధికారులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తమ అభ్యంతరాలు, సూచనలు సమర్పించుకునే వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## జిహెచ్ఎంసి వార్డుల విభజన తప్పుల తడక : నవతారెడ్డి

### వార్డుల విభజనపై అభ్యంతరం వ్యక్తం చేసిన బిఆర్ఎస్ నేతలు



వార్డుల విభజనపై జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు

**శేరిలింగంపల్లి,డిసెంబర్ 12 ప్రభాతవార్త** జీహెచ్ఎంసీలో నూతనంగా జరిగిన వార్డుల విభజనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి అనుకూలంగా విచ్చలవిడిగా డివిజన్లను ఏర్పాటు చేసి వార్డుల విభజనను తప్పుల తడకగా మార్చారంటూ బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడుతున్నారు. డివిజన్ మాప్‌లు అందుబాటులో లేకుండా త్వరితగతిన అభ్యరంతరాలు తెలియజేయాలనే అధికారుల నిర్ణయంపై ప్రతిపక్షపార్టీల నేతలు తప్పుబడుతున్నారు. నేషనల్ హైవేలను విడిచిపెట్టిన చిన్నచిన్న మురికికాలువలను హద్దులుగా నిర్ణయించటం,ఒకే కాలనీని రెండు డివిజన్లుగా చీల్చటం,కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు మాత్రమే డివిజన్ మాప్‌లను అందుబాటులోకి ఉంచుతూ ప్రతిపక్షపార్టీలకు ఏలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### వార్డుల విభజనంతా లోపభూయిష్టమే..

నగర విస్తరణలో భాగంగా జీహెచ్ఎంసీ డివిజన్లను 150 నుంచి 300వరకు పెంచటం జరిగింది. కాగా పెరిగిన డివిజన్లను శాస్త్రీయంగా విభజించలేదంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఒక డివిజన్‌లో 25వేల నుంచి 30వేల ఓటర్లు ఉండాల్సి ఉండగా ఒక డివిజన్‌ను పెద్దగా , ఒక డివిజన్‌ను చిన్నగా తప్పుల తడకగా ఏర్పాటు చేయటమేమిటని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వెస్ట్‌జోన్ కమిషనర్ హేమంత్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నేతలు బొబ్బ నవతారెడ్డి, హరీశ్,రోజా, శ్రీనివాస్,రామకృష , అనంతరెడ్డి తదితరులు తమ ఫిర్యాదులను అందజేశారు.

### తప్పులను సవరించండి:మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గతంలో ఉన్న ఏడు డివిజన్లకు గాను ప్రస్తుతం 18 డివిజన్లగా మారాయని, డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉందని, అధికారులు లోపాలను సవరించాలని శేరిలింగంపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ నేత, చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ వార్డు విభజన పై ప్రజల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరి స్తున్నామని అంటున్నారే కాని ప్రజలకు డివిజన్ మాప్‌లను అందించకపోవడంపై అధికారుల వైఖరి అర్థం కావడంలేదన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆమె వాపోయారు.

# సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తాం

### - జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



సీబీఎన్‌నగర్‌లో బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**తార్నాక, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలో ఎక్కడ చూసినా స్థానిక సమస్యలే ఉన్నాయని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన జనం బాట కార్యక్రమంలో భాగంగా మూడో రోజు సికింద్రాబాద్ నియోజక వర్గంలోని మాణిశ్వరీనగర్ బస్తీ, ఆర్టీసీ ఆస్పిటల్, చంద్రబాబునాయుడు నగర్ బస్తీలల్లో కల్వకుంట్ల కవిత నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ఆమె ఎంతో ఒపికతో విని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామినిచ్చారు. ఈ ప్రభుత్వానికి పేదల పట్ల కనికరం లేదన్నారు.

**చంద్రబాబునాయుడు నగర్‌లో పేదల ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు: కవిత**

సికింద్రాబాద్ నియోజక వర్గంలో ఎన్నో ఏండ్లుగా స్థానిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సీబీఎన్‌నగర్ బస్తీలో ఇండ్లపై కప్పులు ప్రజల మీదపడుతున్నా అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మాణికేశ్వరీనగర్ బస్తీలో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. ఈ బస్తీకి ఉస్మానియా యూనివర్సిటీకి తల్లి కొడుకు లాంటి భంధం ఉందని అలాంటి బందాన్ని జీహెచ్ఎంసీ వార్డుల విభజన పేరుతో ఎలా వేరు చేస్తారని ప్రశ్నించారు. బస్తీని ఓ.యూతో విడదీస్తే ఊరికోమన్నారు. అనంతరం తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి వద్ద యూనియన్ నాయకులతో ఆమె మాట్లాడారు.అనంతరం సీబీఎన్‌నగర్ బస్తీ సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్ యాదవ్‌తో ఆమె మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇండ్ల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి, నాయకులు ఆలకుంట హరి, వేముల మల్లేష్, సత్యనారాయణ, గంగపుత్ర, కళ్యాణ్, జగన్, వేముల కిట్టు, బండారు మహేందర్ ముదిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టికం

- ఒకటో తరగతి విద్యార్థికి 8చోట్ల అట్లకాడ వాతలు
- ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



చిన్నారికి అయిన అట్లకాడ వాతల గాయాలు

**ఫిల్మ్‌నగర్, డిసెంబరు 11, ప్రభాతవార్తః** ఓ చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టికానికి పాల్పడింది. అట్లకాడతో వాతలు పెట్టడంతో చిన్నారికి గాయలయ్యాయి. ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసులు, చిన్నారి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా పెద్దపూడి మండలం గణపతి నగర్‌కు చెందిన వల్లు సత్తిబాబు తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నాలుగేళ్లుగా ఓయూ కాలనీలోని రిలయన్స్ అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. కాగా ఆయన ఇద్దరు పిల్లలన ప్రతి రోజు సాయంత్రం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన శ్రీమానస వద్దకు గత మూడు నెలలుగా ట్యూషన్‌కు పంపుతున్నారు. గురువారం ఇద్దరు పిల్లలు ట్యూషన్‌కు వెళ్లి పెద్దకుమారుడు ఇంటికి తిరిగిరాగా చిన్నకుమారుడైన ఒకటో తరగతి చదువుతున్న వల్లు తేజ్ నందన్(7) ఇంటికి రాలేదు. దీంతో ట్యూషన్ టీచర్‌కు ఫోన్ చేయగా ఇంటికి వచ్చి తీసుకెళ్లాలని సూచించింది. దీంతో ట్యూషన్ వద్దకు వెళ్లగా తేజనందన్ కాళ్లు, చేతులు, తొడలు, ముఖంపై గాయల య్యాయి. అట్లకాడతో కాల్చి వాతలు పెట్టినట్లు కుమారుడు తల్లిదండ్రులకు తెలిపాడు. ఇదే విష యమై ట్యూషన్ టీచర్‌ను నిలదీయగా ఇష్టమున్న చోట చెప్పుకోవాలంటూ బెదిరించింది. ఈ నేపథ్యంలో చిన్నారి తండ్రి ఫిల్మ్‌నగర్ పోలీసుల కు ఫిర్యాదు చేశారు. దాదాపు 8చోట్ల అట్లకాడతో ట్యూషన్ టీచర్ వాతలు పెట్టిగాయాలు చేసిందని సత్తిబాబు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయాల పాలైన చిన్నారిని పోలీసులు గొల్కొండ ఏరియా ఆసుపత్రికి తర లించారు. గాయాల వల్ల తమ కుమారుడు నడవలే కపోతున్నాడని, తన కుమారుడిపై దాష్టికానికి పాల్పడిన ట్యూషన్ టీచర్‌పై చట్టరిత్య చర్యలు తీసుకో వాలని ఫిర్యా దులో కోరారు. ఈ మేరకు పోలీసులు ట్యూషన్ టీచర్‌పై కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు. చెప్పిన మాట వినకపోవ డం వల్లనే వాతలు పెట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

